క్లుప్తంగా

గ్రామ సమస్యలు పరిష్కరిస్తా

● ఎంపీపీ నక్షత్రంజేవంతు



మాట్లాడుతున్న నక్షత్రంజేవంతు

మొయినాబాద్ రూరల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తానని మండల పరిషత్ అధ్యక్షురాలు నక్షత్రంజేవంతు పేర్కొన్నారు. బుధవారం మొయినాబాద్ మండల సర్వసభ్య సమావేశం మండల అభివృద్ధి అధికారి సంధ్య ఆధ్వర్యంలో ఎంపీపీ నక్షత్రంజేవంతు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నక్షత్రం జేవంతు మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి సమస్య ఎదురైనా తన దృష్టికి తీసుకరావాలన్నారు. అనంతరం మండల అభివృద్ధి అధికారి సంధ్య మాట్లాడుతూ ముఖ్యంగా వేసవి కాలంలో నీటి సమస్యలు రాకుండా ప్రత్యేక అధికారులు, పంచాయతీ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య కార్మికులు ఏరోజుకారోజు చెత్తాచెదారాన్ని శుభ్రం చేయాలన్నారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, మండల విద్యాధికారి వెంకటయ్య, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సీఐగా కాంతరెడ్డి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన కాంతరెడ్డి

షాబాద్: షాబాద్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ(ఎస్‌హెచ్‌ఓ)గా కాంతరెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న యాదయ్యగౌడ్ బదిలీపై జీనోమ్‌వ్యాలీకి వెళ్లారు. నార్సింగ్ ట్రాఫిక్ సీఐగా విధులు నిర్వహించిన కాంతరెడ్డిని షాబాద్ సీఐగా ప్రభుత్వం నియమించింది. అనంతరం సీఐ కాంతరెడ్డి మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులకు ప్రజలు సహకరించాలని సూచించారు. గ్రామాల్లో దొంగతనాలు, పేకాట, అసాంఘీక కార్యకలాపాలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని చెప్పారు. నేరాల అదుపునకు ప్రధాన చౌరస్తాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

ప్రతిభను వెలికితీయాలి

● కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ రోహిత్



బహుమతులు అందుకున్న విద్యార్థులతో రోహిత్

మొయినాబాద్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ రోహిత్ కందకట్ల పేర్కొన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజులపాటు 'ఇన్విక్టా–2024' పేరిట నిర్వహించిన సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యానారాయణ, నిర్వాహకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తలకొండపల్లి: మండల పరిధిలోని చెన్నారం సమీపంలో వెలిసిన మల్లప్పగుట్ట శివాలయ బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య గణపతి పూజ, ఏకవార రుద్రాభిషేకం, పాశుపత రుద్రహోమం, అఖండ దీపారాధన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 8న ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించబడుతుందని ఆలయ అధ్యక్షుడు మాకం పాండయ్య చెప్పారు.

కళాకారులకు ఆర్థిక సాయం

తలకొండపల్లి: కళాకారులకు అండగా ఉంటానని మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెల్జాల్‌లోని వేదాద్రి లక్ష్మినరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా కళాకారులు 3 రోజుల పాటు లక్ష్మినరసింహ్మా స్వామి స్టేజీ నాటకాన్ని ప్రదర్శిస్తున్నారు. కనుమరుగవుతున్న కళలను ప్రదర్శించి, ప్రజలకు అర్థమయ్యే రీతిలో నాటక రూపంలో చక్కగా వివరిస్తున్నారు. వీరి ప్రతిభను గుర్తించి కళలను ప్రోత్సాహించాలనే ఉద్దేశ్యంతో శ్రీనివాస్‌యాదవ్ బుధవారం వారికి రూ. 10వేలు అందజేశారు.

పీహెచ్‌సీలో నీటి ఎద్దడి!



నందిగామ పీహెచ్‌సీ



● రెండేళ్లుగా నిలిచిపోయిన సరఫరా
● ఇబ్బందుల్లో రోగులు, వైద్యసిబ్బంది
● పట్టించుకోని ఉన్నతాధికారులు

నందిగామ: మండల కేంద్రమైన నందిగామలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నీటి ఎద్దడి నెలకొంది. దీంతో ఇక్కడికి వచ్చే రోగులు, వైద్యసిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండేళ్లుగా నీటి సరఫరా నిలిచిపోయినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది మేజర్ గ్రామ పంచాయతీ కావడంతో పాటు జాతీయ రహదారి ఉండటంతో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అవసరాన్ని గుర్తించి అప్పటి ప్రభుత్వం 1999లో ఏర్పాటు చేసింది. ఇక్కడ నిత్యం ఔట్ పేషెంట్స్ సుమారు 70 నుంచి 150 మంది వస్తూంటారు. ప్రస్తుతం మండల కేంద్రం కావడంతో పాటు రోగుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుంది. ఇదే క్రమంలో ఇక్కడ కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతున్నారని రోగులు వాపోతున్నారు. దీంతో ఇబ్బందులు పెరుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.

ఇవీ సమస్యలు..

- పీహెచ్‌సీలో కనీసం నీటి సౌకర్యం లేకపోవడంతో అటు వైద్య సిబ్బంది, ఇటు రోగులు అష్టకష్టాలు పడుతున్నారు.
- రెండేళ్ల క్రితం రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించిన మిషన్ భగీరథ పైపు లైను నేటికీ పునరుద్ధరించలేదు.
- ప్రాథమిక ఆరోగ్యకేంద్రం యొక్క ఆవరణలో ఉండే బోరు మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. దీంతో ఆ బోరు ఖాళీగా దర్శనమిస్తోంది.
- వైద్య సిబ్బందితో పాటు, రోగులు మరుగుదొడ్లకు వెళ్లలేని దుస్థితి నెలకొంది
- మూత్ర పరీక్షల అనంతరం రోగులు, వైద్య సిబ్బంది చేతులు కడుక్కోవడానికి నీరు ఉండదు. నీటి సరఫరా లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- పీహెచ్‌సీలోని ఓ బాత్‌రూం తలుపు ఊడిపోవడంతో అక్కడ తాత్కలికంగా తలుపు ఏర్పాటు చేశారు.
- వారం లేదా రెండు వారాలకొకసారి గ్రామ పంచాయతీ సరఫరా చేసే నీటి ట్యాంకర్‌తో కాలం వెళ్లదీయాల్సి వస్తూందని చెబుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి పీహెచ్‌సీకి నీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరుతున్నారు.



మరుగుదొడ్లలో నీటి సరఫరా చేయాలి



పీహెచ్‌సీకి నీటీ సరఫరా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గ్రామ పంచాయతీ అధికారుల చొరవతో వారానికో లేదా రెండు వారాలకొకసారి ట్యాంకర్‌ను పంపిస్తున్నారు. నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో మరుగుదొడ్లను ఉపయోగించుకోలేని పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి నీటీ సమస్యను పరిష్కరించాలి.

– ఆనం నజాం, పీహెచ్‌సీ డాక్టర్, నందిగామ

బోరు మోటార్ ఏర్పాటు చేయాలి



మూత్ర పరీక్షలు చేయాలంటే ల్యాబ్ టెక్నిషన్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాత్‌రూముల్లో నీరు రాకపోడంతో చేతులు కడుక్కోవడానికి నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నీటి సరఫరా చేయాలి.

– కే రాజశేఖర్, ఫార్మసిస్టు, పీహెచ్‌సీ, నందిగామ

వైద్యుల సేవలు గుర్తించండి

ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్



మాట్లాడుతున్న సీఐ ప్రతాప్‌లింగం

షాద్‌నగర్ రూరల్: చికిత్స కోసం వచ్చిన రోగులకు మెరుగైన వైద్యసహాయం చేయడమే కాక, వారి ప్రాణాలను కాపాడడానికి చేసే సేవలను గుర్తించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని సీఎస్‌కే వెంచర్‌లోని ఐఎంఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు వైద్యులు మాట్లాడారు. ఎంతో కష్టపడి చదివి వైద్య కోర్సును పూర్తి చేసిన వైద్యులకు సమాజంలో తగిన గౌరవం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్య రక్షణలో వైద్యుల కృషి ఎనలేనిదన్నారు. పట్టణంలో ఎంతోమంది అనుభవజ్ఞులైన వైద్యులు ఆసుపత్రులను నడుపుతున్నారని, పేదలను దృష్టిలో పెట్టుకొని వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. అత్యవసర సమయంలో చికిత్స అందిస్తున్న తరుణంలో పరిస్థితి విషమించి రోగి చనిపోతే ఆసుపత్రులపై దాడులు పెరిగిపోతున్నాయని అన్నారు. రోగి బంధువులతో పాటు కొందరు నాయకులు ఆసుపత్రులకు చేరుకొని ఆందోళనల పేరుతో యాజమాన్యాలతో సెటిల్‌మెంట్‌చేస్తూ కమీషన్ల దందాకు దిగుతున్నారని ఆరోపించారు. రోగి చనిపోవడానికి గల కారణాలను తెలుసుకోకుండా ఆసుపత్రులపై దాడి చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన ఎంతో మంది యువవైద్యులు ఒత్తిడికి గురై తమ ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. వైద్యులకు పూర్తి స్వేచ్ఛ ఉంటేనే వైద్య వృత్తికి న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం పట్టణ సీఐ ప్రతాప్‌లింగం మాట్లాడుతూ సమాజంలో అన్ని వృత్తులకన్నా వైద్యవృత్తి ఎంతో గొప్పదన్నారు. దేవుడు మనకు ప్రాణాన్నిస్తే ఆ ప్రాణాలను నిలబెట్టే దేవుడు వైద్యుడన్నారు. మనమందరం సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నామంటే అందుకు కారణం వైద్యుల సేవలేనని చెప్పారు. వైద్యులు తప్పుచేస్తే వారిని ప్రశ్నించాలన్నారు. కానీ ఆసుపత్రులపై దాడులచేయడం బాధాకరమన్నారు. ఈ విషయంలో ఏవరైనా వైద్యులు తప్పు చేస్తే బాధితుల ఫిర్యాదుమేరకు తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ నాగిరెడ్డి, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ దిలీప్‌చంద్ర, డాక్టర్ చందూలాల్‌రాథోడ్, డాక్టర్ సురేశ్, డాక్టర్ రమేశ్‌బండారి, డాక్టర్ ఆనంద్, డాక్టర్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

'నమ్రత' సందడి



తహసీల్దార్ కార్యాలయంలో నమ్రత

శంకర్‌పల్లి: సినీహిరో మహేశ్‌బాబు సతీమణి నమ్రత శిరోద్కర్ బుధవారం శంకర్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో సందడి చేశారు. గోపులారంలో ఆమె కొనుగోలు చేసిన రెండున్నర ఎకరాల భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ఆమెను చూసి అభిమానులు తరలివచ్చారు. తహసీల్దార్ సురేందర్, సిబ్బంది రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశారు.

ఆరుట్ల అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి

కాంగ్రెస్ నేత చంద్రయ్య



రోడ్డు పనులను పరిశీలిస్తున్న నాయకులు

మంచాల: ఆరుట్ల అభివృద్ధికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుడ్డిమల్ల చంద్రయ్య అన్నారు. ఆరుట్లలో ఎమ్మెల్యే సహకారంతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.39 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీటీసీ సభ్యుడు కావలి శ్రీనివాస్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ సర్కార్ హయాంలో ఆరుట్లలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరుగలేదన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అడిగిన వెంటనే గ్రామానికి నిధులు ఇవ్వడమే గాకుండా ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పిస్తున్నారని తెలిపారు. ఆరుట్ల గ్రామ ప్రజలందరి తరుపున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఐలయ్య, సురేష్, జంగారెడ్డి, ప్రవీణ్, సికిందర్‌రెడ్డి, నాగరాజ్, పరమేష్, రాయుడు, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులకు అండగా నిలవాలి

సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రావు

షాద్‌నగర్ రూరల్: సీనియర్ సిటిజన్స్ సామాన్యులకు, పేదలకు అండగా నిలవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు రామారావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రావు మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను అరికట్టాలన్నారు. ఎంతోమంది అన్యాయాలకు, అవమానాలకు గురవుతున్నారన్నారు. అలాంటి వారికి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అండగా నిలబడి వారి పక్షాన పోరాటం చేయాలన్నారు. సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ కలిసి కట్టుగా సామాన్యుల హక్కుల సాధనకోసం పని చేయాలని అన్నారు. సాంబశివుడు, సత్యంగౌడ్, జనార్దన్, స్వరాజ్‌బాబు, దుగ్గుశేఖరయ్య, నర్సింలు, పాండు, నాగేశ్వర్, రమాదేవి, విజయరత్నం, ఆంజనేయులుగౌడ్, మాణిక్యం, మదన్‌గోపాల్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక

కొందుర్గు: తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ల సంఘం జిల్లేడ్ చౌదరిగూడ మండల కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఊట్ల బాలకిష్టయ్య, అధ్యక్షుడిగా గంగా బస్వరాజు, ఉపాధ్యక్షుడిగా వేమారెడ్డి, కార్యదర్శిగా కుమ్మరి రామచంద్రయ్యలను నియమించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రావు

ఇచ్చిన మాట నిలబెట్టుకోండి

మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేస్తామన్న మాటను నిలబెట్టుకోవాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని బీఆర్‌ఎస్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామని ఉచితంగా క్రమద్ధీకరణ చేస్తామన్నారు. ఎల్ఆర్ఎస్ పేరుతో ప్రజల నుంచి డబ్బులు వసూలు చేయాలనుకోవడం బాధాకరమన్నారు. ఇచ్చిన హామీలన్నింటిని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజల పక్షాన తాము పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, వంకాయల నారాయణరెడ్డి, కొందూటి నరేందర్, బక్కన్న యాదవ్, లక్ష్మణ్ నాయక్, దేవేందర్ యాదవ్, వెంకట్‌రెడ్డి, కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్, కానుగు అంతయ్య, యుగేంధర్, అడ్డు, మన్నె నారాయణ, కోస్గి శ్రీనివాస్, భీష్వరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి

మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి



షాద్‌నగర్: పూజలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్: ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని చటాన్‌పల్లి గ్రామంలోని శివాంజనేయ స్వామి దేవాలయంలో ఘనంగా శివ పార్వతుల కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరు సన్మార్గంలో పయనించాలన్నారు. భక్తి మార్గంతోనే ముక్తి లభిస్తుందన్నారు. దైవ చింతనతోనే మనస్సు ప్రశాంతంగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రాజేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షాబాద్‌లో..



మహా పడిపూజలో పాల్గొన్న గురుస్వామి శివానంద

షాబాద్: ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని శ్రీ శివానంద గురుస్వామి పేర్కొన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని మద్దూరు గ్రామంలో శివస్వాముల మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఇరుముడులతో శ్రీశైలం యాత్రకు శివస్వాములు పయనం అయ్యారు. ఈ సందర్భంగా శ్రీ శివానంద గురుస్వామి మాట్లాడుతూ భగవంతుడు శివపరమాత్ముడు భూమిపై అవతరించి స్వర్గాన్ని స్థాపించాడని తెలిపారు. పూర్వకాలంలో దేవాలయాలు, భగవంతుని ఆరాధనకే కాకుండా న్యాయం చెప్పడం, విద్య తదితర కార్యక్రమాలకు నెలవుగా ఉండి ధర్మ పరిరక్షణకు నిలిచేవన్నారు. ఈ కార్యక్రమంలో శివస్వాములు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



బహిరంగ సభకు తరలివెళ్తున్న ఎమ్మెల్యే, నాయకులు

షాద్‌నగర్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు షాద్‌నగర్ నుంచి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు భారీ ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని సీఎం రేవంత్‌రెడ్డి నెరవేస్తున్నారన్నారు. ఆరు గ్యారంటీ పథకాలతో పేదలకు లబ్ధి చేకూరుతుందన్నారు. సభకు తరలివెళ్లిన వారిలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, తాంద్ర విశాల శ్రావణ్‌రెడ్డి, కాశీనాథ్‌రెడ్డి, బాబర్‌ఖాన్, రఘు, మహ్మద్ ఇబ్రహీం, శివశంకర్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధరణి సమస్యల పరిష్కారానికి చర్యలు

తహసీల్దార్ గౌతమ్‌కుమార్



దరఖాస్తులు పరిశీలిస్తున్న గౌతమ్‌కుమార్

మొయినాబాద్: ధరణి దరఖాస్తుల సత్వర పరిష్కారం కోసం గ్రామాల్లో పర్యటించి పరిశీలిస్తున్నామని మండల తహసీల్దార్ గౌతమ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ, అజీజ్‌నగర్, బంగాలిగౌడ, హిమాయత్‌నగర్, దేవులపల్లి రెవెన్యూల్లో రెండు బృందాలు పర్యటించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలించడం ద్వారా భూ సమస్యలు పరిష్కరించొచ్చన్నారు. ఆయా గ్రామాల్లో 98 దరఖాస్తులను పరిశీలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వినోద్, ఆర్ఐలు చంద్రమోహన్, రోజ, సీనియర్ అసిస్టెంట్ సురేందర్, సిబ్బంది తరదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

కొందుర్గు: కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు పార్టీలో చేరారు. కొందుర్గు మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, విశ్వనాథ్‌పూర్ మాజీ సర్పంచ్ రామకృష్ణా రెడ్డి, లక్ష్మదేవిపల్లి మాజీ సర్పంచ్ నర్సింలు, వేణుగోపాల్, శ్రీశైలం, పద్మారెడ్డి, శంకరయ్య పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

మహిళా శక్తి ఎంతో గొప్పది

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి

షాద్‌నగర్ రూరల్: సమాజంలో మహిళా శక్తి ఎంతో గొప్పదని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో డీఎం ఉష ఆధ్వర్యంలో బుధవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ మనదేశంలో మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారన్నారు. విద్య, ఉద్యోగం, వైద్యం, రాజకీయం, దేశ భద్రతవంటి రంగాలలో ఉన్నత హోదాలలో రాణిస్తున్నారన్నారు. మహిళలు ఇంటి బాధ్యతలను మోస్తూనే గృహిణిగా, ఉద్యోగినిగా రాణించడం అభినందనీయమన్నారు. తల్లితండ్రులు ఆడ పిల్లలను మగ పిల్లలతో సమానంగా చూడాలని, అప్పుడే వారిలో వివక్ష పోతుందన్నారు. అనంతరం డీఎం ఉష మాట్లాడుతూ సమాజంలో ఎదురయ్యే సంఘటనలకు ఆడ పిల్లలు కుంగి పోకుండా ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో ఉద్యోగులు, సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.



మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి